

ఘనంగా పోచమ్మకు బోనాలు

దస్తురాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవోజీపేట్ గ్రామంలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు భక్తి శ్రద్ధలతో బోనం ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



బోనం ఎత్తుకున్న మహిళలు



డప్పులతో ఆలయానికి వెళ్తున్న మహిళలు



భూములను సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)



జిల్లా కేంద్రంలోని ఇబ్రహీం చెరువు ఇదే..

చెరువు భూముల రక్షణకు చర్యలు

- జిల్లాలో తెరపైకి లేక్ ప్రొటెక్షన్ కమిటీలు
- మళ్లీ మొదలు కానున్న సర్వే
- ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలకు రంగం సిద్ధం
- భూ భారతిలో చెరువు భూముల లెక్కలు
- శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములకు రక్షణ

నిర్మల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలో జరుగుతున్న చెరువుభూముల ఆక్రమణపై ఎట్టకేలకు యంత్రాంగం సీరియస్ చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్‌పీసీ)ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని చెరువులకు సంబంధించిన ఎఫ్‌టీఎల్,బఫర్‌జోన్‌లలో జరిగిన నిర్మాణాలను గుర్తించనున్నారు. ఈ కమిటీలు రెండు రోజుల తర్వాత రంగంలోకి దిగనున్నాయి. కమిటీలో అడిషనల్ ఎస్పీతో పాటు ఆర్డీవో, ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఏడీ, ఇరిగేషన్ ఈఈ, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. వీరి సర్వే తర్వాత ఆక్రమణకు గురైన భూముల వివరాలు అలాగే ఆ భూముల్లో జరిగిన నిర్మాణాలతో పాటు ఆక్రమణ దారులకు సంబంధించిన జాబితాను రూపొందించనున్నారు. దీని ఆధారంగా ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం కానుంది. అలాగే అక్రమ నిర్మాణాలను స్వాధీనం చేసుకోనున్నారు.



చెరువుల ఆక్రమణలపై కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు

కబ్జా కోరల్లో భూములు

నిర్మల్‌లోని చారిత్రక గొలుసుకట్టు చెరువు భూముల విస్తీర్ణాన్ని గుర్తించినప్పటికీ ఆక్రమణలకు మాత్రం అడ్డు అదుపు లేకుండా పోతోంది. ఇక్కడి గొలుసు కట్టు చెరువు భూముల విస్తీర్ణంతో పాటు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను కూడా రెవెన్యూ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు గుర్తించారు. గత కొన్నేళ్ల నుండి గొలుసుకట్టు చెరువు భూముల ఆక్రమణ పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తుండటం, అలాగే ఆక్రమణలపై కొంతమంది రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించడంతో జిల్లా యంత్రాంగం ఈ భూములను నిర్ధారణ, రక్షణకు చర్యలు చేపట్టింది. దీనికోసం గాను చెరువు భూములపై డీజీపీఎస్ విధానంతో సర్వే చేపట్టారు. మొత్తం పదకొండు గొలుసుకట్టు చెరువుల సర్వే చేపట్టి విస్తీర్ణాన్ని నిర్ధారించారు. బంగల్‌పేట చెరువు 210.32 ఎకరాలు, ఖజానా చెరువు 98.22 ఎకరాలు, కొత్త చెరువు 33.11 ఎకరాలు, రాంసాగర్ 37.23 ఎకరాలు, జాఫూర్ కుర్రన్నపేట చెరువు 76.18 ఎకరాలు, సీతాసాగర్ గొల్లపేట చెరువు 48.11 ఎకరాలు, ఇబ్రహీం చెరువు 76.18 ఎకరాలు, కంచరోని చెరువు 74.19 ఎకరాలు, ధర్మసాగర్ చెరువు 65.10 ఎకరాలు, మోతి తలాబ్ 132.06 ఎకరాలు, చిన్న చెరువు మంజులాపూర్ 81.34 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు అధికారులు తెల్చారు. అలాగే చెరువు శిఖంతో పాటు ఎఫ్‌టీఎల్‌ను కూడా గుర్తించిన అధికారులు ఎఫ్‌టీఎల్ నుంచి తొంభై అడుగుల దూరం వరకు బఫర్‌జోన్‌గా నిర్ధారించారు. ఈ బఫర్ జోన్ వరకు ఎలాంటి నిర్మాణాలు చేయకూడదన్న నిబంధన ఉంది. బఫర్‌జోన్ పరిధిలో నిర్మాణాలు గాని రియల్ వెంచర్లకు గాని ఎన్‌ఓసీలను సంబంధిత ఇరిగేషన్ శాఖ జారీ చేయకూడదు. అలాగే మున్సిపాలిటీ అధికారులు నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయకూడదని నిబంధనలు విధించారు. చెరువు భూముల నిర్ధారణతో ఇక ఆక్రమణలకు అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు భావించారు. అయితే హైకోర్టు తీర్పు నేపథ్యంలో సంబంధిత అధికారులు చెరువు భూములకు హద్దులు నిర్ధారించడమే కాకుండా ఆ హద్దులలో ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల పాటు చెరువు భూముల ఆక్రమణల వ్యవహారం దీని కారణంగా స్తబ్దంగా మారింది. అయితే ప్రస్తుతం మళ్లీ కొంత మంది ఈ హద్దులను చెరిపేస్తూ ఆక్రమణల పర్వానికి తెరలేపుతున్నారు. అప్పట్లో హద్దులు నిర్ణయించిన అధికారులు బదిలీ కావడంతో కొత్త అధికారులకు ఈ చెరువుల హద్దులపై పెద్దగా అవగాహన లేకపోవడం కబ్జాదారులకు కలిసొస్తుందన్నారు.

హద్దులను చెరిపేస్తున్నారు

కాగా నిర్మల్ చుట్టూరా ఉన్న గొలుసుకట్టు చెరువుల ఆక్రమణలపై గతంలో ఓ న్యాయవాది రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. హైకోర్టు ఇక్కడి చెరువుల ఆక్రమణలపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా కలెక్టర్‌కు సైతం నోటీసులు జారీ చేసింది. అలాగే జిల్లా కోర్టుకు సంబంధించిన న్యాయమూర్తిని చెరువుల ఆక్రమణలపై పరిశీలించాలంటూ సూచించింది. అయితే రాష్ట్ర హైకోర్టు కలెక్టర్‌కు హెచ్చరికలు జారీ చేయడంతో యంత్రాంగం ఒక్కసారిగా కదిలింది. హుటాహుటిన జీపీఎష్ విధానంతో చెరువు భూముల సర్వే చేపట్టి యుద్ధ ప్రాతిపదికన ఈ హద్దుల ఆధారంగా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయడం, ట్రెంచ్‌లను తవ్వడం లాంటి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కబ్జాదారులు కంచరోని చెరువు, ధర్మసాగర్, సీతాసాగర్, పల్లెచెరువు భూములపై మళ్లీ కన్నేశారు. క్రమంగా చెరువు భూములకు ఆనుకొని ఉన్న పట్టా భూముల సర్వే నంబర్ పేరుతో ఈ భూములను కూడా కబ్జా చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల చెరువుల్లో వెంచర్లు కూడా మొదలు పెట్టారు. చెరువు భూములలో ఆక్రమణ బహిరంగంగా జరుగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిని అవకాశంగా తీసుకుంటున్న కబ్జాదారులు మరింత రెచ్చిపోతున్నారంటున్నారు.

క్రిమినల్ చర్యలు తీసుకుంటాం

కిషోర్‌బాబు, అడిషనల్ కలెక్టర్



చెరువు భూముల ఆక్రమణలపై సర్వే పూర్తికాగానే చర్యలు మొదలు పెడతాం. భూములను ఆక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. సర్వేలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు. ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటాం. చెరువు భూముల సరిహద్దులను నిర్ధారించి ఫెన్సిం గ్‌లు ఏర్పాటు చేస్తాం. ఇక నుంచి చెరువు భూముల రక్షణ లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కొన సాగనుంది.



పోలీసుల ఆధ్వర్యంలో ఎర్రకుంట ఆక్రమణలను తొలగిస్తున్న బృందం (ఫైల్)

రైలులో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం

బాసర, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వెళ్లిన గర్భిణి తిరుగు ప్రయాణంలో రైళ్లోనే ప్రసవించిన ఘటన గురువారం బాసర రైల్వే స్టేషన్‌లో జరిగింది. మహారాష్ట్రలోని కరికెల్లి గ్రామానికి చెందిన నాగేశ్వరి అనే మహిళ గురువారం నిజామాబాద్‌కు వెళ్లి ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకొని కాచిగూడ నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లో రైల్లో తిరుగు ప్రయాణమైంది. బాసర స్టేషన్ వరకు రాగానే పురిటి నొప్పులు రావడంతో రైల్లోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే బాసర రైల్వేస్టేషన్ సిబ్బంది అప్రమత్తమై తల్లిబిడ్డను భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. తల్లిబిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



రైలులో జన్మించిన బాలుడిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

బాల కార్మికులతో పనిచేయిస్తే చర్యలు తప్పవు

- జిల్లా న్యాయాధికారి రాధిక



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి రాధిక

ముథోల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మికులతో పనిచేయిస్తే చర్యలు తప్పవని జిల్లా న్యాయాధికారి రాధిక అన్నారు. మండలంలోని తరోడా గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం న్యాయ సేవా సమితి, సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బడిఈడు పిల్లలందరినీ బడికి పంపాలన్నారు. కానీ కొందరు అక్కడక్కడ బాల కార్మికులుగా పనిచేయిస్తూ బాలలకు అన్యాయం చేస్తున్నారని అలా చేస్తే చర్యలు తప్పవన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బాలలను పనిలో పెట్టుకోకూడదని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టిన వారికి, పనిలో ఉంచిన వారికి చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా పాఠశాలలకు పంపాలని పేర్కొన్నారు. అలాగే బాల్య వివాహాలను నిర్మూలించాలని సూచించారు. ఎవరు కూడా బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదన్నారు. అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని పేర్కొన్నారు. వాటిపై ప్రత్యేక కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే సంబంధితశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు సమ దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బిట్ల పర్సెస్, సీడీపీవో సరోజిని, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నగర్‌లో ఒకరి హత్య

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన భైంసా ఏఎస్పీ అవినాష్

లోకేశ్వరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నగర్ గ్రామంలో గురువారం ఒకరిని హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.... గురువారం ఉదయం గడ్డం పోసులు(64) అనే వ్యక్తి తన ఇంటి నుంచి పొలానికి వెళ్తుండగా నగర్ బస్టాండ్ వద్ద అదే గ్రామానికి చెందిన గడ్డం గంగాధర్, గడ్డం సాయిలు ఇద్దరు కలిసి సంవత్సరం క్రితం తన 17 నెలల కూతురు అదే విధంగా రెండు నెలల క్రితం గంగాధర్‌కు చెందిన రెండు ఆవులు చనిపోయాయని అదే విధంగా గత కొన్ని సంవత్సరాల నుండి తన తల్లి లక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతుందని వీటన్నింటికీ గడ్డం పోసులు చేతబడి చేయడమే కారణమని భావించి పై ఇద్దరు కలిసి గడ్డం పోసులుని నగర్ బస్టాండ్ దగ్గర కాపు కాసి తనతో తెచ్చుకున్న సిమెంట్ ఇటుకతో తలపై కొట్టి హత్య చేశారు. మృతుడి కొడుకు గడ్డం సాయన్న ఫిరాయదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ముథోల్ సీఐ మల్లేష్, లోకేశ్వరం ఎస్సై అశోక్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. హత్య చేసిన నిందితులు పరారీలో ఉన్నారని వారి కోసం వెతుకుతున్నామన్నారు.

వరద నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్లకు సూచించిన మంత్రి పొంగులేటి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వర్షాకాలం నేపథ్యంలో వరదల కారణంగా జరిగే నష్టాన్ని నివారించేందుకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో కృష్ణ, గోదావరి నదుల పరివాహక జిల్లాల కలెక్టర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈసారి సాధారణం కంటే అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని, అందుకే అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

అన్ని శాఖల సమన్వయంతో వరదల వల్ల ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గతంలో వరదలతో నష్టం జరిగిన ప్రాంతాల్లో ముందే రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు, వరదల వల్ల తలెత్తే ఏమైనా సమస్యలు, నివేదికలను తక్షణమే ప్రభుత్వానికి అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. జిల్లాలో గతంలో సంభవించిన వరదలపై అధ్యయనం చేసి ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించామని, ఎలాంట అపాయాలు లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్
- ఘనంగా పాఠశాలల పునఃప్రారంభ దినోత్సవ వేడుకలు



కొరిటికల్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్

మామడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం రోజున మామడ మండలం కొరిటికల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పాఠశాల పునఃప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థులు అభ్యాసంలో ఉత్తమంగా రాణించాలని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతీ తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. విద్యా ప్రమాణాల పెంపు కోసం జిల్లా యంత్రాంగం కట్టుబడి పని చేస్తోందని వివరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో అధికారులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ విద్యాధికారి సత్యనారాయణరెడ్డి, జిల్లా విద్యాధికారి పి.రామారావు, ఎంఈవో వెంకట రమణారెడ్డి, ఉపాధ్యాయులు, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ ఏలేటి చిన్న లింగారెడ్డి, మాజీ సర్పంచ్ లింగారెడ్డి, అభివృద్ధి సమితి సభ్యులు చిన్నయ్య, తల్లిదండ్రులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



నాలాను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్

జిల్లా కేంద్రంలో నాలాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

నిర్మల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ముందు నాళాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన నిర్మల్ పట్టణంలోని జౌలినాళ, చైన్‌గేట్ నాళ, దివ్య నగర్ పార్క్, రాంజీ గోండు విగ్రహ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... వరద నీటి ప్రవాహానికి అంతరాయం కలుగకుండా నాళాల్లో పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించాలని సూచించారు. ప్రజలు నాళాల్లో చెత్త వేయకుండా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతి వర్షాకాలానికి ముందు నాళాల శుభ్రత క్రమం తప్పకుండా నిర్వహిస్తే వరదల సమస్య తలెత్తదని చెప్పారు. పట్టణంలోని పార్కులను శుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, పార్కులకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, అధికారులు హరిభువన్, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

నేర నిరూపణలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం

- జిల్లాలో 12 పోలీసుస్టేషన్‌లకు అంబిస్ టెక్నాలజీ పరికరాల పంపిణీ

నిర్మల్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నేరగాళ్లు తెలివి మీరుతున్నారు. దర్యాప్తు అధికారులకు చిక్కకుండా ఎత్తుకుపై ఎత్తులు వేస్తున్నారు. గతంలో వేలిముద్రల ఆధారంగానే నేర దర్యాప్తు చేసేవారు. కానీ ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక అంబిస్ టెక్నాలజీతో కాలిముద్రలు, ఐరిస్, ముఖ కవళికలు, ఎత్తు, బరువు, చేతిరాత, ఇలా ప్రతి విషయాన్ని నమోదు చేయవచ్చు. జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 12 పోలీసుస్టేషన్‌లకు ఈ అంబిస్ పరికరాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. గతంలో అఫిజ్ టెక్నాలజీ ఉపయోగించి లైవ్‌స్కానర్ ద్వారా నేరగాళ్ల వేలిముద్రలు, అరచేతి ముద్రలు మాత్రమే తీసుకునేవాళ్లం. కానీ ఇప్పటి నుంచి అత్యాధునిక టెక్నాలజీ అయిన అంబిస్‌ను ఉపయోగించడం జరుగుతుంది. ఈ అంబిస్ టెక్నాలజీలో డెల్ ఆప్టిప్లెక్స్ ఆల్ ఇన్ వన్ 7420 (సిస్టమ్), ఐరిస్ స్కానర్ బీఎం-20 (కళ్ళ స్కానర్), ఎప్సన్ వి 39 స్కానర్ (పాద ముద్రల స్కానర్) లాజిటెక్ సి 270 వెబ్ క్యామ్ (నేరస్థుల ఫోటోలను నిక్షిప్తం చేసే పరికరం), హెల్త్ సెన్స్ బీఎస్ 161 (ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్), ఎంఎస్‌సీడీ (చెకింగ్ పరికరం) పాపిలోన్ పామ్ లైవ్ స్కానర్ పరికరాలను జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల ఐపీఎస్ పంపిణీ చేశారు. ఈ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా నేరగాళ్ల పూర్తి సమాచారం అనగా ముఖ కవళికలు, ఐరిస్ (కళ్లు), ఎత్తు, బరువు, పాదముద్రలను తీసుకొని డేటా బేస్ సర్వర్‌లో నిక్షిప్తం చేయడం జరుగుతుంది. తద్వారా ఆ నేరగాళ్లు మళ్లీ ఎప్పుడైన నేరం చేసి పట్టుబడినప్పుడు ఈ అంబిస్ టెక్నాలజీ ఉపయోగించి నేరగాళ్లను చాలా సులభంగా గుర్తిసామని పేర్కొన్నారు. ఫింగర్ ప్రింట్ లైవ్ స్కానర్, ఎంఎస్‌సీడీ పాపిలోన్ డివైస్ ట్రైనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ఈ డివైస్‌ల వినియోగం గురించి ఎలాంటి సందేహాలున్న ఫింగర్‌ప్రింట్ ఇన్‌చార్జి ఏఎస్సై కిరణ్‌తో నివృత్తి చేసుకోవాలన్నారు. సిబ్బంది ప్రతీ ఒక్కరూ ఈ ఫింగర్ ప్రింట్ లైవ్‌స్కానర్, ఎంఎస్‌సీడీ పాపిలోన్ డివైస్‌లపై నైపుణ్యత కలిగి తమ తమ పోలీసుస్టేషన్‌లలో నమోదు అవుతున్న వివిధ రకాల నేరాలు, సస్పెక్ట్ చెక్ ఫింగర్ ప్రింట్స్ సేకరించి, కేసుల చేదనకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరూ కూడా తమ విధుల్లో పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో నిబద్ధతితో పని చేయాలని, తమకు కేటయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్‌రెడ్డి, నిర్మల్ ఏఎస్పీ రాజేష్‌మీనా ఐపీఎస్, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ ఐపీఎస్, ఇన్స్‌పెక్టర్లు నైలు, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ సమ్మయ్య, ఆర్‌లు రాంనిరంజన్‌రావు (అడ్మిన్), శేఖర్, రామకృష్ణ, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా.. ఒకరి మృతి

- నలుగురికి గాయాలు



ప్రమాదస్థలంలో ఆశన్న మృతదేహం

దిలావర్‌పూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్యాసింజర్ ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృత్యువాత పడిన ఘటన దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామ సమీపంలో గురువారం జరిగింది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం సారంగాపూర్ మండలం వైకుంఠాపూర్ (డోనిగామ) గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రావణ్ తన ఆటోలో నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రయాణికులను ఎక్కించుకుని సారంగాపూర్ మండలంలోని తాండ్ర గ్రామానికి బయలుదేరాడు. అయితే కాల్వ గ్రామ శివారులోని మూల మలుపు వద్ద ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో తాండ్ర గ్రామానికి చెందిన ఆశన్న ముదిరాజ్(50) అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. తాండ్ర గ్రామానికి చెందిన ముత్తవ్వ, నిజామాబాద్ జిల్లా ముప్కాల్ గ్రామానికి చెందిన విజయలక్ష్మిలతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా ఆట్లో డ్రైవర్ శ్రావణ్ ఆటోను అజాగ్రత్తగా, అతివేగంగా నడపడం వల్లనే ఆటో బోల్తా కొట్టిందని ప్రయాణికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పి. రవీందర్ తెలిపారు.

25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న టౌన్ ఎస్ఐ

భైంసా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టిప్పు సుల్తాన్ చౌరస్తా మార్గంలో బొలెరో వాహనంలో తరలింపబడుతున్న 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వలను పట్టుకున్నట్లుగా భైంసా టౌన్ ఎస్ఐ సుప్రియ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం వేళలో అక్కడి మార్గం మీదుగా వెఅనుమానస్పదంగా వెలుతున్న వాహనాన్నీ ఆపి తనిఖీ చేయగా అందులో 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించినట్లుగా వివరించారు. వెంటనే సంబంధిత వాహనాన్ని స్వాధీనపరుచుకొని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లుగా పేర్కొన్నారు. వాహనంలోని పీడీఎస్ బియ్యం నిల్వలను సివిల్ సప్లయ్ శాఖాధికారులకు అప్పగించినట్లుగా వివరించారు. కాగా సంబంధిత పీడీఎస్ బియ్యం నిల్వలు స్థానిక ఎంఎల్ఎస్ కేంద్రం నుంచి కుంటాల మండలంలోని సూర్యాపూర్ రేషన్‌షాపుకు అనుమతి లేని వాహనంలో సరియైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా సరఫరా చేస్తుండగా పోలీసులకు పట్టుబడినట్లుగా తెలిసింది.

పిడుగుపాటు మృతుల

కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

భైంసా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ క్షేత్రాలలో విత్తనాలు విత్తుతున్న క్రమంలో పిడుగుపాటు బారిన పడి ఆదిలాబాద్ జిల్లాలో మృతి చెందిన బాధిత రైతు కుటుంబాలను ప్రభుత్వం తగు రీతిలో ఆదుకోవాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్ డిమాండ్ చేశారు. గురువారం సంబంధిత విషయంలో పత్రిక ప్రకటన విడుదల చేశారు. పిడుగుపాటుతో గురువారం ఆదిలాబాద్ జిల్లాలోని గాదిగూడ మండంలోని పిప్పిరి గ్రామంలో నలుగురు. బేల మండలంలోని సాంగిడిలో ఒకరు. సోన్కాస్ గ్రామంలో మరొకరు కలిసి మొత్తం ఒకే రోజు ఆరుగురు రైతులు మృతి చెందడం ఎంతో విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పిడుగుపాటు బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురైన రైతులందరికి మెరుగైన రీతిలో వైద్య సేవలు అందేలా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ఇదే క్రమంలో మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


ఉట్నూర్‌లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఉట్నూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉట్నూర్ మండల విద్యాధికారి రాపెల్లి ఆశన్న అన్నారు. గురువారం పాఠశాలలు పునః ప్రారంభం సందర్భంగా లక్కారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డ్రెస్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ మర్సకోల తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ సీపతి లింగాగౌడ్, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ కవిత, ఉపాధ్యాయులు ముడుగు శామ్యుల్, అక్కల రవిచంద్ర గౌడ్, బండి రాజారామ్ పాల్గొన్నారు. మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి సుధాకర్, ఎంఈవో ఆశన్న, హెచ్ఎం జ్యోతిల ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు.

జైనథ్ : మండలంలోని ఆయా గ్రామాలలో గల ప్రజల తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని జైనథ్ మండల ఎంపీడీవో రవీంద్రనాథ్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం జైనథ్‌లో విద్యాసంవత్సరం ప్రారంభంలో భాగంగా విద్యార్థులు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో జైనథ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎస్.రాములు, గ్రామ కార్యదర్శి ముజీబ్, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ అడెల్లబాయి పాల్గొన్నారు.

తలమడుగు : చదువుతోనే ఆదివాసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. గురువారం నందిగామ దిశా మోడల్ స్కూల్లో పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దివాకర్, బీఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర రెడ్డి, మాడురి మల్లేష్, రమాకాంత్ పాల్గొన్నారు. పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించే బాధ్యత తల్లిదండ్రుల దేనని ఎంపీడీవో రమాకాంత్ కోరారు. ఐకేపి ఎపిఎం చంద్రశేఖర్, అంగన్‌వాడీ టీచర్స్ మంజుల, రమణ, పద్మ పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ ఉచితంగా పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్నామని మండల విద్యాధికారి వెంకట్‌రావు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం శేఖర్‌లు పాల్గొన్నారు.

బోథ్ : ఉన్నత లక్ష్యంతో చదివి ఉన్నతులుగా ఎదగాలని కౌటా (బి) గ్రామ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. పాఠ్య పుస్తకాలను సహకార సంఘం మాజీ చైర్మన్ ఎస్ బాపురెడ్డి, వీడీసీ గౌరవ అధ్యక్షులు ఎం.గంగయ్య, వీడీసీ ఉపాధ్యక్షులు మేర రమణ, విద్యార్థుల తల్లిదండ్రుల చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు అందించారు.

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం : ఎమ్మెల్యే అనిల్ జాదవ్


విద్యార్థినులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బోథ్ డివిజనల్ స్థాయిలో ప్రతిభ కనబరచడం అభినందనీయం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినిలు డివిజనల్ స్థాయిలో ప్రతిభ కనబరచడంతో వారిని తన నివాసంలో సన్మానించారు. గిరిజన పాఠశాలలో చదువుకునే విద్యార్థినులు డివిజనల్ స్థాయిలో టాపర్‌గా నిలిచినందుకు ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి అంబారావు, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ఉపాధ్యాయులు చందర్ సింగ్, ప్రకాష్, మదన్ సింగ్, సంతోష్, ధనరాజ్ తదితరులున్నారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

కేసీఆర్ హయాంలోనే సర్కారు బడులకు పూర్వవైభవం వచ్చిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరి పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్ సింగ్, మండల కన్వీనర్ శివారెడ్డి, వీడీసీ చైర్మన్ రవిందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి, ప్రతాప్, పాండు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన బిక్కు నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవిందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పవన్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, ప్రతాప్ ఉన్నారు.

భయం భయంగానే బడికి..


తిర్పెల్లి పాఠశాలలో కూలిన చెట్టు

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులు ఇబ్బందికర పరిస్థితుల్లోనే చదువులను కొనసాగిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేపడితే చాలా చోట్ల సమస్యలు దూరమయ్యే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీ సమీపంలోని హిందీహై స్కూల్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షం ఈదురుగాలుల బీభత్సంతో పాఠశాల ఆవరణలో ఉన్న భారీ వృక్షం తరగతి గదిపై పడిపోయింది. దీంతో తరగతి గదిలో కూర్చునేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. అయినా ఇప్పటి వరకు చెట్టును తొలగించక పోవడంతో ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని విద్యార్థులు భయం భయంగానే చదువుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. అలాగే చాలా పాఠశాలల్లోనూ నీటి గుంటలు ప్రమాదకరంగా మారి దర్శనమిస్తున్నాయి.

సమస్యలు పరిష్కరించే దిశగా పని చేస్తున్నాం

● శ్రీనివాస్‌రెడ్డి (డీఈవో, ఆదిలాబాద్)

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తున్నాం. ఇప్పటికే చాలా పాఠశాలల్లో మెరుగైన వసతులను కల్పించడం జరుగుతోంది. అక్కడక్కడ మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. వర్షాకాలంలో కొన్ని చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే పరిశీలించి పరిష్కరిస్తాం.

ఉట్నూర్‌లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

ఉట్నూర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌ను రెండో సారి నియమించడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బానోత్‌వసంతరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఖయ్యుం, డీసీసీబీ డైరెక్టర్ ఎస్పీ రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం కార్యకర్తలు నాయకులు స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ ఇక్బాల్, జిల్లా ఆర్టీఏ సభ్యులు దూట రాజేశ్వర్, మేస్రం భాగ్య, దాసండ్ల ప్రభాకర్, అరికెలా పరమేశ్వర్, బిరుదుల లాజర్, శ్రీనివాస్, అన్సారి, చిలువేరు లింగన్న, పాషా తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో లేగ దూడ జన్మదిన వేడుకలు


లేగదూడ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు

బోథ్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పదోవార్డులో మాజీ ఎంపీటీసీ రజియా బేగం కుటుంబీకులు పెంచుకుంటున్న ఆవు రెండు సంవత్సరాల క్రితం దూడను జన్మనిచ్చింది. అయితే లేగ దూడ పుట్టి రెండు సంవత్సరాలు పూర్తి అవుతున్నా ఆవు మాత్రం ప్రతీరోజు 10 లీటర్ల పాలు ఇస్తూనే ఉందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. లేగ దూడ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు.

యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి

ఇచ్చోడ, జూన్12, (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాల వార్షికోత్సవం సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో యోగాపై అవగాహన కార్యక్రమంపై పీహెచ్‌సీ వైద్యురాలు మధురిమ, యోగా ఇన్‌స్ట్రక్టర్ సాయి నిర్వహించారు. జాతీయ ఆయుష్మాన్ పథకంలో భాగంగా మండల కేంద్రంలోని ఆయుష్ కేంద్రాలలో యోగా ఇన్‌స్ట్రక్టర్‌ల ద్వారా యోగా శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై గ్రామ కార్యదర్శులకు అవగాహన

బోథ్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శులకు గురువారం కుచలాపూర్ గ్రామంలో ఎంపీడీవో రమేష్ అవగాహన కల్పించారు. వివిధ దశల్లో ఫొటోలను ఆన్‌లైన్ యాప్ ద్వారా నమోదు చేయు విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ అఖిల్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఏఈ జల్పాలు ఉన్నారు. మండలంలోని దన్నూర్ బి గ్రామంలో గురువారం గ్రామపంచాయతీ కార్యదర్శి శిరీష ఇం దిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి. చంటి, నాయకులు జిల్లా కార్యదర్శి వినయ్, ఎల్మ వినయ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటు కారోబరి సతీష్‌లు పాల్గొన్నారు.

'గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఇళ్లు మంజూరు కాలేదు'

నేరడిగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యంతోనే పేదలకు ఇళ్లు మంజూరు కాలేదని ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావ్ అన్నారు. గురువారం మండలంలోని చిన్న బుగ్గారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. లబ్ధిదారులకు ప్రొసిడింగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఆడే వసంత్‌రావు

విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు చేపట్టాలి

● బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ స్పెషల్ ఆఫీసర్ భీమ్‌సింగ్


ఇచ్చోడలో సూచనలు ఇస్తున్న జాయింట్ సెక్రెటరీ భీంసింగ్

నేరడిగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా ప్రత్యేకచర్యలు చేపట్టాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ జాయింట్ సెక్రెటరీ భీమ్‌సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, లెక్చరర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతేడాది కంటే ఈసారి అడ్మిషన్లు 30 శాతం అదనంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఐఈవో గణేష్ కుమార్, ప్రిన్సిపల్ శబాన తరన్నమ్, లెక్చరర్లు సుభాష్, ప్రవీణ్‌పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి

ఇచ్చోడ : ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచాలని, ప్రైవేటు కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు పనిచేయాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ జాయింట్ సెక్రెటరీ భీంసింగ్ అన్నారు. గురువారం హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి వచ్చిన ఆయన ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలని, విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కళాశాల సిబ్బంది ఆయనను సన్మానించారు. ఆయన వెంట డీఐఈవో జాదవ్ గణేష్, కళాశాల ప్రిన్సిపల్ శంకర్, అధ్యాపకులు సోమన్న, ప్రభాకర్‌రెడ్డి, గోవర్ధన్, బాలాజీ, నాగభూషన్, మాధవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీ సభ్యులకే ఇళ్లు : ఓరగంటి

సిరికొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఇందిరమ్మ కమిటీ సభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఓరగంటి పెంటన్న అన్నారు. గురువారం సిరికొండ మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులైనటువంటి ఇందిరమ్మ కమిటీ సభ్యులందరికీ ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేసుకున్నారని ఆయన ధ్వజమెత్తారు. అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ళకు అధికారులు, ఇంది రమ్మ కమిటీ సభ్యులందరూ కలిసి భూమి పూజ చేసి ధృవీకరణ పత్రాలు అందించడం జరిగిందని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ చిన్న రాజన్న. లతీఫ్, నెల్లుట్ల రాజు.గంగన్న, అజ్గర్, లస్మన్న, మెహమ్మద్, రోహిదాస్, తోకల రాజన్న, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంప్‌లను వినియోగించుకోవాలి

నేరడిగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాథోడ్ నరేందర్ ఆదేశానుసారం ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్‌లో భాగంగా గురువారం నేరడిగొండ మండలంలోని వాంకిడి గ్రామంలో క్యాంపు నిర్వహించారు. ఆర్బిఎస్కే అడా బృందం, ఎంపీహెచ్ఎ, ఆశ, ఐసీటీసీ సిబ్బంది, ఎమ్ ఐసీటీసీ కౌన్సెలర్, ఎస్టీవో పీఎం, ఎంఅండ్ ఇ అండ్ ఔట్రీచ్ సిబ్బంది కార్యక్రమంలో హెల్త్ క్యాంప్ 65 మంది ప్రజలకు వివిధ రకాల పరీక్షలు (బీపీ, షుగర్, టీ, హెచ్ఐవీ, సిఫిలిస్) పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ మోహిజ్ అహమద్ మాట్లాడుతూ ఇంకా పరీక్షలు పెంచాలని విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ శిబిరాలు వంద రోజుల పాటు జిల్లాలో గల అన్ని మండలాల్లో జరుగుతాయని, ప్రజలు ఈ హెల్త్ క్యాంప్‌లను వినియోగించుకొని వారి ఆరోగ్య స్థితిని మెరుగుపర్చుకోటానికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ క్యాంప్‌లో సిబ్బంది ఎ. సంతోష్, హెల్త్ సూపర్‌వైజర్, ప్రాజెక్ట్ మేనేజర్ (ఎస్టీఓ) భాను రేఖ, మొబైల్ ఐసిటిసి కౌన్సిలర్ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, అవుట్ రీచ్ వర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టండి

నిర్మల్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఆదేశం


కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీపీవో శ్రీనివాస్

ఖానాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మండల అధికారులను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సీపీవో జీవరత్నంతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలల ఆవరణలో మొక్కలను నాటారు. ఆయన వెంట ఖానాపూర్ ఎంపీడీవో సునీత, ఎంపీవో చిక్యాల రత్నాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి కల్పన, తదితరులున్నారు.

మురికినీరు తాత్కాలిక పరిష్కారం చూపిన డీఎల్‌పీవో

భైంసా రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోతుల్‌గాం గ్రామంలో గత కొద్ది రోజుల నుండి మురికినీరు నిల్వ ఉండ డంతో కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడ్డారు. కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డీఎల్‌పీవో సుదర్శన్ స్పందించి మురికినీరును తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. శాశ్వత పరిష్కారం కొరకు కొంత సమయం కావాల్సి ఉంటుందని తెలిపారు. మురికినీరు వెళ్లిపోవడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. శాశ్వత పరిష్కారం త్వరలోనే మురికి నీరు వెళ్లడానికి పరిష్కరిస్తామని తెలిపారు. ఈయన వెంట ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, గ్రామ పెద్దలు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

దిలావర్‌పూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లిలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థానిక ఇందిరమ్మ కమిటీ సభ్యులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు టి.విద్యాసాగర్‌రెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కే. దేవేందర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ పంచాయతీ కార్యదర్శి స్వాతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఏముల మహేష్, దైతు భోజన్న, రమేష్, ముస్కు సునీత, గంగామణి, మోతె భోజారెడ్డి పాల్గొన్నారు.

అంటు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించండి

లక్ష్మణచాంద, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అటు వ్యాధులు సోకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని మండల వైద్యాధికారి ప్రత్యూష అన్నారు. వరల్డ్ విజన్ ఇండియా స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పీచర గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో అంటువ్యాధులపై స్థానికులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ బ్రహ్మన్న దోమ తెరలను పంపిణీ చేశారు. ప్రోగ్రాం కో ఆర్డినే టర్ ఆనోకు, వాలంటీర్లు రఘు, అశోక్, పరిమళ, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముథోల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ముథోల్‌లోని ప్రభుత్వ బాలికల గిరిజన సంక్షేమ కళాశాలలో మిగిలిన ఎంపీసీ, బైపీసీ సీట్లకు ఈ నెల 16 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభం


భైంసాలో పాఠశాలకు వస్తున్న విద్యార్థులు


సోన్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ


ముజ్గి ప్రాథమిక పాఠశాలలో..

భైంసా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో గురువారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. భైంసా పట్టణ, మండల పరిధిలోని 13 జిల్లా పరిషత్ హైస్కూల్, 8 ప్రాథమికోన్నత, 47 ప్రాథమిక పాఠశాలలు, గురుకుల, ఆశ్రమ, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు ఉదయం వేళలో తెరుచుకున్నాయి. విద్యా సంవత్సరం అరంభమైన రోజును పురస్కరించుకొని పలు పాఠశాలల్లో ఉదయం సరస్వతీ అమ్మవారి పూజ కార్యక్రమాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొలిరోజు సందర్భంగా అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు హాజరైన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫామ్స్ జతలను పంపిణీని చేపట్టారు.

సోన్ మండలంలో..

సోన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నూతన విద్యా సంవత్సర సంబరాలు నిర్వహించినట్లు మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ తెలిపారు. నూతన పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు పుష్పగుచ్ఛంతో ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, సమరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్. వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుందరంగా తీర్చిదిద్దిన పాఠశాలలు

లోకేశ్వరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పాఠశాలలు సుందీకరంగా మామిడి తోరణాలతో, అరటి ఆకులతో, బెలూన్లతో అంగరంగ వైభవంగా పాఠశాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యులు, గ్రామ ప్రజలు తీర్చిదిద్దారు. ఒక పండుగ వాతావరణంలో ఆ పాఠశాలలు అగుపించాయి. విద్యార్థులందరూ ఎంతో ఆనందంగా పాఠశాలకు వచ్చారు. వచ్చిన విద్యార్థులకు పుష్పాలతో, బెలూన్లతో ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

నర్సాపూర్(జి), జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని నర్సాపూర్(జి) జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పురుషోత్తం స్పష్టం చేశారు. విద్యార్థులకు దుస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కైలాస్, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసి, వారికి ఉన్నత భవిష్యత్తు లభించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ప్రోత్సాహాన్ని, సౌకర్యాలను మరోసారి తెలియజేసింది.

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దిలావర్‌పూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పీవీ రమణారెడ్డి అన్నారు. మండలంలోని బన్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు కిషన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

కుంటాల, జూన్, 12 : (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవులు ముగిసి గురువారం పాఠశాలలు పున ప్రారంభం కావడంతో కుంటాల ఆదర్శ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ నవీన్‌తో పాటు ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ ఏడాది బాగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆట పాటతో వేసవి సెలవులు గడిపిన విద్యార్థులు నేటి నుండి బడిబాట పట్టారు.

ముథోలమండలంలో విద్యార్థుల సందడి

ముథోల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పున ఃప్రారంభమయ్యాయి. మొన్నటి వరకు వేసవి సెలవులు ఆస్వాదించిన విద్యార్థులు ఇక ఆటలకు స్వస్తి చెపిప పాఠశాల బాట పట్టారు. గురువారం పాఠశాలలో విద్యార్థులతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా విద్యార్థులు సంతోషంతో పుస్తకాల సంచి చేతబట్టి బడిబాట పట్టారు.

పాఠశాలలను పరిశీలించిన ప్రత్యేక అధికారి

ముథోల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ ఆశ్రమ, కస్తూరిబాగాంధీ పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను గురువారం మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ రాథోడ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివ కుమార్, పంచాయతీ ఈవో అన్వర్, ఏపీవో శిరీషారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ

దస్తురాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుసులను తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, మండల విద్యాధికారి గంగాధర్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు పాఠశాలలో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బడిబాట కార్యక్రమం

నిర్మల్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించినట్లు మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని గవర్నమెంట్ పాఠశాల జుమ్మెరాత్‌పేట్‌లో నూతన విద్యా సంవత్సరం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అల్లం రవిబాబు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలతో ఉజ్వల భవిష్యత్తు

భైంసా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికతో చదువుతూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ సాధుల కృష్ణదాస్ పేర్కొన్నారు. గురువారం భైంసాలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహకంగా తన వంతుగా నగదు నజరానాను జ్ఞాపికలను అందించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇందులో బీజేపీ భైంసా పట్టణ అధ్యక్షులు రావుల రాము, ప్రధాన కార్యదర్శి దగడే శ్రీకాంత్, ఎంసీటీ చైర్మెన్ డా.నగేష్, ప్రబంధకారిణి ప్రతినిధులు కుంట కాశీనాథ్, కాండ్లీ సాయినాథ్, రాజేశ్వర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో డీఈవో తనిఖీ


పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి

నిర్మల్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కురన్నపేట్ నందు గల యూఆర్ఎస్ పాఠశాలను డీఈవో పి.రామారావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, వంటగదిని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేస్తూ పలు సూచనలు చేయడం జరిగింది. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం ఉంచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఏకరూప దుస్తులను పరిశీలించి, విద్యార్థులందరికి గురువారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త లింబా ద్రి, టెక్స్ బుక్ గోడౌన్ మేనేజర్ భానుమూర్తి, యూఆర్ఎస్ ప్రత్యేక అధికారి క్రాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీలను వెంటనే రెన్యూవల్ చేయాలి

నిర్మల్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీలను వెంటనే రెన్యూవల్ చేయాలని అతిథి అధ్యాపకులు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌కి వినతిపత్రం అందజేశారు. జూన్ 2 నుంచి 3వ సెమ్, 5వ సెమ్ అన్నీ విభాగాలకు సంబంధించిన విద్యార్థులకు తరగతులు బోధిస్తూ, ప్రాక్టికల్ పరీక్షలు చేయిస్తూ, ఇంటర్నల్ పరీక్షలు నిర్వహిస్తూ అడ్మిషన్ కూడా చేస్తున్నారు. అలాగే న్యాక్ రికార్డులు సైతం తయారు చేస్తున్నారు. అంతేకాకుండా కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలకు జూన్ నెల 2వ తేదీ నుంచి యూనివర్సిటీ అల్మానిక్ ప్రారంభమైంది. కానీ కాలేజీ కమిషనరేట్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ ఇప్పటి వరకు రెన్యువల్ ఇవ్వకపోవడంతో జూన్ నెల జీతం కోల్పోయే అవకాశం ఉంది. కన్సాలిడేటెడ్ వస్తుందేమోనని అనుమానం వ్యక్తమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ ఎల్మల రంజిత్‌కుమార్, డాక్టర్ రాథోడ్ మురహరి, అరుగుల నరేందర్, దిలీప్‌కుమార్, త్రిపాఠి వెంకట్‌రెడ్డి, రవీందర్, ఎండీ మున్నవర్, నుస్రత్, మెహ్రోజ్, తహన్నియత్, సాధియ, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెరువు భూములను కబ్జా నుంచి కాపాడాలి

కడెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా ధర్మాజీపేట్ రైతులు గ్రామ చెరువు భూములను కబ్జా నుండి హద్దులు ఏర్పాటు చేసి కాపాడాలని కడెం తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ చెరువును కొందరు కబ్జా చేస్తున్నారని వెంటనే ఆ భూములను కాపాడి చర్యలు తీసుకోవాలని కోరారు.

శిశు మందిర్ పాఠశాలలో గాయత్రి హోమం

ముథోల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని శిశు మందిర్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరం పాఠశాల ప్రారంభం సందర్భంగా గాయత్రి హోమం నిర్వహించారు. వేద పండితులు ప్రకాష్ శాస్త్రి, ప్రణీత్ శాస్త్రి మంత్రోచ్చారణలతో పాఠశాల అధ్యక్షులు కే. సంజీవ్ దంపతుల చేత గణపతి, సరస్వతీ, లక్ష్మీదేవిలకు పూజలు నిర్వహించి, గాయత్రి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు సారధి రాజు, విద్యార్థులు, ఆచార్యులు, పోషకులు, ప్రబంధకారిణి సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల భక్తి ఉద్యమం..మహాచండీ యాగం

నిర్మల్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14, 15 తేదీల్లో తెలంగాణ ఉద్యమకారుల భక్తి ఉద్యమం, మహా చండీ యాగం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కొట్టె శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



శిథిలావస్థకు చేరిన బాదనకుర్తి పాఠశాల భవనం



ఒకే గదిలో వేర్వేరు తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు

రెండు గదులు.. ఏడు తరగతులు

● తొలిరోజే 64 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు

● నిర్మాణం పూర్తయినా ఏడాదిగా ప్రారంభానికి నోచుకోని పాఠశాల భవనం ● బాదనకుర్తిలో శిథిలావస్థకు చేరిన పాత భవనం

ఖానాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజే ఓ పాఠశాలలో ఇటు విద్యార్థులకు అటు ఉపాధ్యాయులకు సమస్యలు స్వాగతం పలికాయి. 'అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు' అన్న నానుడికి ఖానాపూర్ మండలంలోని బాదనకుర్తి గ్రామం సరిగ్గా సరిపోతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరు విశాలమైన గదులతో రూ. 70 లక్షల పైచిలుకు వ్యయంతో పాఠశాల కోసం నిర్మించిన భవనం ఓ రెండు రాజకీయ పార్టీల మధ్య ఆధిపత్య పోరులో విద్యార్థులు నలిగిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు 120 మంది విద్యార్థులతో కళకళలాడిన ఆ పాఠశాలకు క్రమేపి విద్యార్థులను పంపేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. గ్రామంలోని ఓ రెండు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు పట్టుదలకు పోవడంతో నూతన భవనం ప్రారంభం ఆలస్యమవుతుందని పేరు చెప్పేందుకు సైతం భయపడుతున్న కొందరు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలను పక్కనపెట్టి నూతన భవనాన్ని ప్రారంభిస్తే పాఠశాలకు పునర్ వైభవంగా వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన పాఠశాల పాత భవనం

బాదనకుర్తి గ్రామంలో పాఠశాల పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు విరిగి పడుతుండడంతో ఆ భవనాన్ని ఉపయోగించవద్దని అధికారులు ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసి తాత్కాలికంగా పక్కనే మరో రెండు గదులను కేటాయించారు. ఈ రెండు గదులలో ప్రస్తుతం ఒకటి నుండి ఏడు తరగతులను నిర్వహిస్తున్నారు. అన్ని తరగతుల పిల్లలను ఒకే గదిలో కూర్చోబెట్టి చదువు చెప్పాల్సిన పరిస్థితి తలెత్తింది. చిన్న చిన్నగా ఉన్న రెండు ఇరుకు గదులలో తొలి రోజు 64 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు విద్యాబోధన చేసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఒక దశలో 120 మంది విద్యార్థులతో కళకళలాడిన బాదనకుర్తి పాఠ శాలకు ప్రస్తుతం సొంత భవనం లేక గ్రామస్థులు ప్రైవేట్ పాఠశాల లకు పిల్లలను పంపాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

విద్యార్థుల సంఖ్య తగ్గకుండా శ్రమిస్తున్న ఉపాధ్యాయులు..

బాదనకుర్తి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు 4 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గకుండా ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించి ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులను తిరిగి ప్రభుత్వ పాఠశాల బాట పట్టించారు. తొలి రోజు పాఠశాలకు 64 మంది విద్యార్థులు హాజరు కాగా మరో 30 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రత్యేకంగా గురుకుల శిక్షణకై ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. గత ఏడాది నాలుగవ తరగతిలో పది మంది విద్యార్థులు గురుకుల పరీక్ష రాసేందుకు సన్నద్ధం అవ్వగా అందులో ఎనిమిది మందికి గురుకుల సీట్లు వచ్చినట్లు చెబుతున్నారు. ఇలా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా ఉపాధ్యాయులు శ్రమిస్తున్నప్పటికీ సరైన కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపేందుకు మొగ్గు చూపుతున్నట్లు చెబుతున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే భవిష్యత్తులో ఉన్న ఉపాధ్యాయులను సైతం ఇతర ప్రాంతాలకు పంపుతారని ప్రస్తుతం చక్కగా నడుస్తున్న పాఠశాలను పోగొట్టుకుంటే తమ గ్రామంలో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నూతన భవనం ప్రారంభిస్తే సమస్యకు పరిష్కారం..

గ్రామంలో పాఠశాల నిర్వహణ కోసం ఆరు విశాలమైన గదులతో ఎన్ఆర్ ఈజీఎస్ నిధుల ద్వారా నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభిస్తే ఇరుకు గదుల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఇటు ఉపాధ్యాయులు అటు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. నూతన భవనం వద్ద కాంపౌండ్ వాల్, వంట గది, బాత్రూంలు నిర్మాణం చేపట్టక పోవడంతో వాటి నిర్మాణం పూర్తయ్యేంత వరకు తాత్కాలికంగా పక్కనే ఉన్న ఓ ఫంక్షన్ హాల్ బాత్రూంలను వినియోగించుకోవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాఠశాల భవనాన్ని ఆనుకుని ఉన్న ఓ పంట కాలువపై ప్రస్తుతానికి తాత్కాలిక వంతెన ఉన్నప్పటికీ దానిపై శాశ్వతంగా ఓ చిన్నపాటి వంతెన నిర్మాణం చేస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కాగా గ్రామంలో ప్రధాన రాజకీయ పార్టీలలో ఉన్న కొంత మంది పెద్దల మధ్య వర్గ పోరు విద్యార్థులకు సమస్యగా మారుతోందని చెబుతున్నారు. ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించి వెంటనే పరిష్కరించేలా జిల్లా అధికార యంత్రాంగం స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

నూతన భవనాన్ని వెంటనే ప్రారంభిస్తే బాగుంటుంది..

- ప్రేమ్ సాగర్, ఎంఈవో, ఖానాపూర్



బాదనకుర్తి గ్రామంలో ఇరుకు గదులలో పాఠశాల నిర్వహణ ఇబ్బందిగా ఉంది. ప్రస్తుత భవనంలో తరగతులను నిర్వహించడం ఉపాధ్యాయులకు సవాల్‌గా మారుతోంది. గ్రామస్థులంతా సహకరించి నిర్మాణం పూర్తయిన నూతన భవనాన్ని ప్రారంభించేలా చూడాలి. నూతన భవనం ప్రారంభమైతే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.



గ్రామ పంచాయతీ కార్యాలయం

నిలిచిన నిధులు.. ఆగిపోతున్న పనులు

● అంటీ ముట్టనట్లు ప్రత్యేక అధికారులు ● కార్యదర్శుల పైనే భారం

● పంచాయతీల పాలన అస్తవ్యస్తం

దిలావర్‌పూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో అభివృద్ధి పనులు కుంటు పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు ఏడాదిన్నర కాలంగా నిలిచిపోయాయి. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకుండా ప్రభుత్వ ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే గ్రామ పంచాయతీల్లో నిధులు లేమితో ప్రత్యేక అధికారులు కూడా అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం మీన మేషాలు లెక్క పెడుతుండటంతో పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీ పాలక వర్గాలు లేక భారమంతా పంచాయతీ కార్యదర్శుల పైనే పడుతోంది. నిధులు లేకున్నా పనుల విషయంలో ఉన్నతాధికారుల ఒత్తిడిని తట్టుకోలేక పంచాయతీ కార్యదర్శులు సతమత మవుతున్నారు.

ఏడాదిన్నర కాలంగా నిలిచిన నిధులు..

గ్రామ పంచయతీల పాలక వర్గాల పదవీ కాల పరిమితి 2024 ఫిబ్రవరితో ముగిసింది. వెంటనే ఎన్నికలను నిర్వహించాల్సిన ప్రభుత్వం అలాకాకుండా పాలన బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. అయితే అంతో ఇంతో గ్రామ పంచాయతీలకు ఉపయోగపడుతున్న ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ పాలక వర్గాలు కేంద్ర ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం నుంచే నిలిపి వేసింది. ఇక రాష్ట్ర ప్రభుత్వం కూడా స్టేట్ ఫైనాన్స్ నిధులను ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఆ నిధులను ఇవ్వకుండా ఆపేసింది. దీంతో గ్రామాల్లో పన్నుల రూపంలో వచ్చే జనరల్ ఫండే దిక్కవుతోంది.

పత్తాలేని ప్రత్యేక అధికారులు..

పంచాయతీ పాలక వర్గాల పాలన వ్యవధి ముగియడంతో ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించకుండా గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. మొదట్లో తమకు అప్పగించిన గ్రామ పంచాయతీలను సందర్శిస్తూ వచ్చిన ప్రత్యేక అధికారులు ఆ తర్వాత ఎప్పుడో ఒక వ్పుడు వస్తూ అంటీముట్టనట్లుగా పాలనను గాలికొదిలేశారు.

భారమంతా కార్యదర్శుల పైనే..

ఇటు పంచాయతీ నిధులు లేక.. అటు ప్రత్యేక అధి కారులు పట్టించుకోక పోవడంతో పంచాయతీ భారమంతా కార్యదర్శుల పైనే పడుతోంది. గ్రామాల్లో పన్నుల రూపంలో వచ్చే జనరల్ ఫండ్ ఎటూ సరిపోక కార్యదర్శులు అప్పులు చేయాల్సి వస్తోంది. పారిశుధ్య కార్మికులకు నెలనెలా వేతనాలు చెల్లించేందుకే సరిపోతాయని మిగతా ప్రతీ నెల విద్యుత్ బిల్లులు, వీధి దీపాల నిర్వహణకు పనులకు జేబు నుంచి చెల్లించాల్సి వస్తోందని లేదంటే అప్పులు తెచ్చు కోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

బోరు మోటార్ల వద్ద జర జాగ్రత్త!

● ప్రమాదకరంగా ఇనుప స్టార్టర్ బాక్సులు

● అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాలు దూరం

భైంసా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బోరు, వ్యవసాయ బావుల మోటార్ల వద్ద కరెంటు షాక్ తగిలే ప్రమాదాలు ఎక్కువగా వానాకాలం ప్రారంభంలోనే చూస్తుంటాం. కాణం వేసవి పంటల తర్వాత భూగర్భ జలాలు తగ్గిపోవడంతో దాదాపు రెండు నెలల పాటు పంట విరామం ఉంటుంది. ఈ సమయంలో ఈదురుగాలులు, అకాల వర్షాలతో తీగలు తెగిపోవడం, కనెక్షన్ వదులుగా మారి మోటార్లు, బాక్సులకు విద్యుత్తు సరఫరా కావడం వంటివి జరుగుతుంటాయి. ఈ సమయంలో అన్నదాతలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి.



స్టార్టర్ బాక్స్

● సొంత మరమ్మతులు వద్దు..

ఈదురు గాలులతో కురిసే వర్షాలకు స్తంభాలు ఓ వైపు వంగడం, కూలడం జరుగుతుంది. స్తంభం నుంచి బోరుకు వచ్చే సర్వీసు వైర్లు తెగిపోయే ప్రమాదం ఉంటుంది. వాటి పరిసరాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా గమనించాలి. తెగిన వైర్లు గమనిస్తే తక్షణమే అధికారులకు సమాచారం అందించి సరఫరా నిలిపివేయించాలి. సంబంధిత సిబ్బందితో మాత్రమే మరమ్మతులు చేయించుకోవాలి.

● మోటార్ల వద్ద ఇలా..

బోరు మోటార్లు ఆన్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. మూతలు లేని స్టార్టర్లు, ఇనుప డబ్బాలతో ప్రమాదం పొంచి ఉంటుంది. కొన్ని సార్లు తీగలు, ఫ్యూజ్‌లు తెగిపోయి ఉంటాయి. తరుచూ వాటిని పరిశీలించాలి. మూతలు లేకపోతే వర్షం పడినప్పుడు లోపలి భాగం తడిసిపోతుంది. ఆ సమయంలో బోరు వేయకపోవడమే ఉత్తమం. సాధారణ సమయాల్లోనూ డబ్బా దగ్గరకు వెళ్లినప్పుడు కాళ్లకు చెప్పులు, చేతి తొడుగులు ధరించాలి. నాణ్యమైన ప్లాస్టిక్ డబ్బాలు మాత్రమే వాడటం ఉత్తమం. బోరు బావుల్లో కంపెనీ మోటార్లే వాడాలి. ఒక వేళ కాలిపోయినా విద్యుత్తు సరఫరా కాదు. ప్రైవేటు వ్యక్తుల వద్ద తక్కువ ధరకే వచ్చినా.. అవి కాలిన సందర్భాల్లో పైపుల వరకు విద్యుత్తు సరఫరా అయి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.



బోరు బావి

తలమడుగులో బస్టాండ్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

● ఎండకు వానకు చలికి మర్రి చెట్టు ఆధారం ● అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టింపు కరువు



తలమడుగు మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో బస్సు కోసం చెట్ల కింద వేచి చూస్తున్న ప్రయాణికులు



తలమడుగులో మర్రి చెట్టే బస్టాండ్

తలమడుగు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలో ప్రయాణికులకు బస్టాండ్ సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న ఎవరు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మారుమూల గిరిజన గ్రామాల నుంచి వివిధ పనుల కోసం మండల కేంద్రానికి వచ్చిన గ్రామీణ ప్రజలకు ప్రయాణికులకు బస్సుల కోసం వేచి చూడడానికి బస్టాండ్ లేకపోవడంతో చెట్ల కింద, హోటల్లో వేచి చూడాల్సిన పరిస్థితిలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఒక్కొక్క రోజు సమయానికి బస్సులో రాకపోవడంతో గంటల తరబడి చెట్ల కింద ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంతే కాకుండా ప్రయాణికులు తాగు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలందరూ ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సాగిస్తున్నారు. మండలంలో 30 గ్రామ పంచాయతీలు, 50 గ్రామాలు ఉన్నప్పటికీ బస్సులో సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రైవేట్ వాహనాలు ప్రయాణాలు సాగిస్తున్నారు. గతంలో జిల్లా కేంద్రం నుంచి కోసాయి వరకు రెండు బస్సులు నడపగా ప్రస్తుతం ఓకే బస్సు నడవడంతో మారుమూల గిరిజన గ్రామాల ఆదివాసులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. బస్సు లేక పోవడంతో ప్రైవేట్ వాహనాల్లో అధిక డబ్బులు చెల్లించి వెళ్ళవలసిన పరిస్థితిలో ఏర్పడుతున్నాయి. గతంలో బస్టాండ్ నిర్మాణం కోసం గ్రామస్థులు స్థలం ఇచ్చినప్పటికే సంబంధిత శాఖ అధికారులు బస్టాండ్ నిర్మాణ కోసం నిధులు మంజూరు చేయకపోవడంతో బస్టాండ్ నిర్మాణం కలగానే మిగిలిపోయింది. గత ఎన్నికల సమయంలో మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మిస్తామని ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చారు తప్ప ఇప్పటివరకు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సాధించి మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.



● త్వరగా బస్టాండ్ నిర్మాణం చేపట్టాలి

తలమడుగు మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం వెంటనే. బస్టాండ్ నిర్మాణం చేపట్టి మౌలిక వసతులు కల్పించి బస్సుల సంఖ్యను పెంచాలి.

- బడగరి రవికాంత్ యాదవ్, ప్రయాణికుడు




పాఠశాలను శుభ్రపరుస్తున్న దృశ్యం

ఓవైపు పిల్లల ఆటలు.. మరోవైపు ఏర్పాట్లు

విద్యా ఏడాది పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. పాఠశాలల ప్రాంగణాల్లో పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు ఇతరాత్ర వసతుల కల్పనలో సిబ్బంది నిమగ్నమయ్యారు. మరోవైపు బడి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో పిల్లలు ఆటలతో సందడి చేస్తున్నారు. వేసవి సెలవులను ఆట పాటలతో సరదాగా గడిపి విద్యా సంవత్సరాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

● (ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్)




చిన్నారుల ఆటలు

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.3 । కనిష్ఠం 27.2



గురుకులంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు

నేరడిగొండ , జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గారం (బి) గ్రామంలో గల తెలంగాణ గిరిజన గురుకుల బాలికల కళాశాలలో మిగిలిన ఇంటర్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ వేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సీఈసీలో 12 సీట్లలో ఎస్టీలకు ఆరు, ఓసీ ఒకటి, బీసీ ఒకటి, ఎస్సీ ఒకటి, స్పోర్ట్స్ ఒకటి, ఫిజికల్ హ్యాండిక్యాప్ ఒకటి, అనాథలకు ఒకటి చొప్పున ఉన్నట్లు పేర్కొన్నారు. హెచ్ఈసీలో 17 సీట్లలో ఎస్టీల కు 11, ఓసీ ఒకటి, బీసీ ఒకటి, ఎస్సీ ఒకటి, స్పోర్ట్స్ ఒకటి, ఫిజికల్ హ్యాండిక్యాప్ ఒకటి, అనాథలకు ఒకటి సీటు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.



ఆదిలాబాద్‌లోని హిందీ హైస్కూల్‌లో పిచ్చిమొక్కలతో నిండిన పాఠశాల పరిసరాలు

భయం భయంగానే.. బడికి!



ఇచ్చోడలోని ప్రాథమిక పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు

- సమస్యల నడుమ మొదలైన సర్కారు చదువులు
- అసంపూర్తిగా కనిపిస్తున్న అదనపు గదుల నిర్మాణాలు
- పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారిన పరిసర ప్రాంతాలు
- వర్షపు నీటితో నిండిపోతున్న పలు పాఠశాలల ఆవరణలు
- తొలిరోజు అంతంత మాత్రంగానే విద్యార్థుల హాజరు శాతం
- అధికారుల నిర్లక్ష్యంతో వెక్కిరిస్తున్న సర్కారు బడులు

ఆదిలాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల సమస్యలతో విద్యార్థులు భయం భయంగానే బడికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వేసవి సెలవులు ముగిసి పోవడంతో గురువారం ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. అయితే కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్న మార్పు కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు - మన బడి కార్యక్రమం అలాగే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకాన్ని అమలు చేస్తున్న సమస్యలు తీరినట్లే కనిపించడం లేదు. ప్రైవేట్‌కు దీటుగా ప్రచారం చేస్తున్న ప్రభుత్వ బడులపై ప్రజల్లో ఇంకా చిన్నచూపే కనిపిస్తోంది. ప్రతీ ఏటా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా ఆశించిన స్థాయిలో విద్యార్థుల నమోదు జరుగడం లేదు. తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తున్న ఉపాధ్యాయులు పేద విద్యార్థులను మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఉన్నత పాఠశాలలు 120, ప్రాథమిక పాఠశాలలు 500లు, ప్రాథమికోన్నత పాఠశాలలు 119 మొత్తం 739 పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 47,809 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తొలిరోజు అంతంత మాత్రంగానే విద్యార్థుల హాజరు శాతం కనిపించింది. కొన్ని పాఠశాలలకు విద్యార్థులు అసలే రాక పోవడంతో మధ్యాహ్నం నుంచే పాఠశాలలను మూసి వేయాల్సి వచ్చింది. అధికారులకు ముందు చూపు లేక పోవడంతో చాలా పాఠశాలల్లో సమస్యలు వెక్కిరిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడి పనులు అక్కడే..

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాలను అమలు చేస్తున్న దానికగుణంగా నిధులను విడుదల చేయక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మన ఊరు - మన బడి పథకం కింద జిల్లాలో 237 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 37 పాఠశాలల్లో టెండర్ల ద్వారా పనులను చేపట్టగా మరో 200ల పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు పనులు చేపట్టాయి. అయితే ఈజీఎస్ కింద బిల్లులు చెల్లించే విధానంతో చాలా చోట్ల పనులు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కిచెన్‌షెడ్, టాయిలెట్ మరమ్మతులు, ప్రహరీల నిర్మాణం పనులను చేపట్టకుండానే వదిలేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద జిల్లాలో 649 పాఠశాలల్లో మరమ్మతు పనులను చేపట్టారు. ఇందులో డ్రింకింగ్ వాటర్, విద్యుత్ మరమ్మతులు, టాయిలెట్ల నిర్మాణం లాంటి పనులను చేపట్టినా బిల్లులు సకాలంలో చేతికందక పోవడంతో అసంపూర్తిగానే వదిలేశారు. సుమారుగా రూ.7.50కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఉన్న గదులను కూల్చివేసి వాటి స్థానంలో కొత్తగా అదనపు గదుల నిర్మాణాలను చేపట్టిన పూర్తి కాక పోవడంతో ఆరుబయటనే చదువులను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ప్రమాదకరంగా పరిసరాలు

పాఠశాలల పరిసర ప్రాంతాలు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. చాలా చోట్ల పాఠశాలలకు ప్రహరీ నిర్మాణం లేకపోవడంతో పందులు, కుక్కలు, పశువులు స్వైర విహారం చేస్తున్నాయి. పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించక పోవడంతో చిన్నపాటి చిట్టడవిని తలపిస్తున్నాయి. తరగతి గదుల చుట్టు పిచ్చిమొక్కలు పెరిగి పోవడంతో విష సర్పాల సంచారం పెరిగి పోయే ప్రమాదం ఉందంటున్నారు. గతంలో పలువురు విద్యార్థులు పాము కాటుకు గురైన దాఖలాలు కూడా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉంది. అలాగే పాఠశాల ఆవరణలో మురికి నీరు నిండిపోయి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. చెత్తా చెదారం పేరుక పోయి కనిపిస్తున్నా తొలగించే ప్రయత్నం చేయడం లేదు. వేసవి సెలవుల్లోనే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఇప్పుడు ఇబ్బందులు తప్పేవన్న వాదనలు వినిపిస్తున్నాయి.

చినుకు పడితే చిత్తడే..

వర్షాకాలంలో చిన్నపాటి వర్షాలు కురిసిన పాఠశాల ఆవరణ ప్రాంగణాలు చిత్తడిగా మారి పోతున్నాయి. దీంతో విద్యార్థులు అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి కనిపించడం లేదు. కొన్ని సందర్భాల్లో బురద నీటిలో జారిపడి ప్రమాదాల భారిన పడుతున్నారు. వర్షపు నీటిలో నుంచే తరగతులకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కనీసం పాఠశాల ఆవరణ నుంచి వర్షపు నీటిని బయటకు పంపించేందుకు ఏర్పాట్లు కూడా చేయకపోవడంతో చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. వర్షాకాలంలో విద్యార్థులకు ప్లేగ్రౌండ్లు లేక తరగతి గదులకే పరిమితమవుతున్నారు. అలాగే తరగతి గదుల పైకప్పులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షపు నీరు గదుల్లోకి చేరి చిత్తడిగా మారుతున్నాయి. దీంతో

(మిగతా 6వ పేజీలో)

భూభారతి రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

● సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్



రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఉట్నూర్,జూన్12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా అనాధిగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని షాంపూర్, లక్కారంలలో జరిగిన భూభారతి రెవెన్యూసదస్సులను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులకు వచ్చిన దరఖాస్తుల గురించి తెలుసు కున్నారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ తమ భూ సమస్యలను దరఖాస్తుల ద్వారా రెవెన్యూ సదస్సులకు సమర్పించి పరిష్కరించా లన్నారు. ఎలాంటి భూ సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి వీలు పడుతుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జీ తహసీల్దార్ జాదవ్ మృతులాల్, గిర్దావర్లు కార్యదర్శులున్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

● జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల పూర్తిస్థాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. గురువారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాటాడుతూ అనధికారికంగా, డాక్టర్‌తో ధృవీకరించకుండా మెడికల్ షాపులలో మెడికల్ డ్రగ్స్ అమ్మినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బుధవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఎన్టీఆర్ చౌక్ వద్ద ఒకటో పట్టణ ఎస్సై ఎస్.అశోక్ సిబ్బందితో వాహన తనిఖీ నిర్వహించగా టెర్మిన్ డ్రగ్‌బాటిళ్లు రూ.1500 చొప్పున అమ్మేందుకు గుడిహత్నూర్ మండలం, కొల్హారి వైపు వెళ్తున్నాడని తెలిపారు. అనంతరం డీఎంహెచ్ఓ నరేందర్‌రాథోడ్ మాట్లాడుతూ యువత ఎక్కువ సేపు గేమింగ్ ఆడడానికి, మత్తులో ఉండడానికి ఇలాంటి డ్రగ్స్‌ను వినియోగిస్తారని, ఇది చట్ట ప్రకారం నేరమని తెలిపారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ బి.సునీల్‌కుమార్, సిబ్బంది తదితరులున్నారు.

ప్రాథమిక సహకార సంఘంలో అందుబాటులో యూరియా

ఉట్నూర్,జూన్12(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో రైతులకు కావాల్సిన యూరియా అందు బాటులో ఉందని సీఈవో మల్లయ్య తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో రావాలన్నారు. 40కిలలో బ్యాగుధర సబ్సిడీ పోను రూ.260 ఉందన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా జూపల్లి కృష్ణారావు



మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆదిలాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాదిన్నర కాలంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగుతున్న సీతక్కను మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా పనిచేస్తున్న జూపల్లి కృష్ణారావును ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమిస్తూ ప్రభుత్వం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఇన్నాళ్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగిన మంత్రి సీతక్కను నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లా ఇన్‌చార్జి మంత్రి మార్పుతో అధికారపార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత కొంత కాలంగా మంత్రి సీతక్క పనితీరుపై సొంత పార్టీలోనే వ్యతిరేకత వ్యక్తమైనట్లు ప్రచారం జరిగింది. కొంత మంది నేతలకే ప్రాధాన్యతను ఇచ్చిందన్న టాక్ వినిపించింది. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడిపోవడంతో ఉమ్మడి జిల్లాపై పెద్దగా దృష్టి సారించలేదన్న వాదనలు కూడా ఉన్నాయి. సొంత పార్టీ నేతలను కాదని ప్రతి పక్ష పార్టీలకు చెందిన వారికి ఇందిరమ్మ కమిటీల్లో అవకాశం కల్పించడంపై జిల్లా కాంగ్రెస్ క్యాడర్‌లో ఆగ్రహం వ్యక్తమయింది. ఇన్‌చార్జి మంత్రి మార్పుపై పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా



మాంగూర్లలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

జైనథ్,జూన్12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా గ్రామాలలో గల తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల పరిధిలో గల మాంగూర్ల గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ట్రైనింగ్ పొందిన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నారు. దీంతో పాటు రెండు జతల యూనిఫాంలను నోట్‌బుక్‌లు పాఠ్యపుస్తకాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జైనథ్ మండల ఎంఈఓ జి.శ్రీనివాస్, హెచ్ఎం రవీందర్‌గౌడ్, డీఈఓ ఎ.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐటీడీఏ పీహెచ్‌వో సందీప్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు



సందీప్‌కుమార్

ఉట్నూర్, జూన్12 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్ గుడిమల్ల సందీప్‌కుమార్‌కు గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన డీఎంవీఎల్ఎన్ ప్రసాద్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లినందున తాత్కాలికంగా సందీప్ కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పచెప్పారు. పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు తెర్చుకున్న నేపథ్యంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల సూచనలు మేరకు సందీప్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. బాధ్యతలు చేపట్టిన సందీప్‌కుమార్‌ని జీసీసీ సిబ్బంది గోవిందరావు, లింబారావు, సత్యనారాయణ తదితరులు కలిసి అభినందించారు.

జిల్లాలో భారీ వర్షం



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

ఆదిలాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) :ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అత్యధికంగా నార్నూర్ మండలంలో 42.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే బేల మండలంలో 32.5, ఇంద్రవెల్లిలో 31.5 ఆదిలాబాద్ అర్బన్‌లో 28.5 బోరజ్‌లో 23.5, మావలలో 21.3, ఉట్నూర్ మండ లంలో 14.0 మి.మీలర్ల వర్షం కురిసింది. అకస్మాత్తుగా పిడుగులు పడి బేల గాదిగూడ మండలాల్లో ఆరుగురు రైతులు అక్కడికక్కడే మృతిచెందగా ఉట్నూర్ మండలంలో మరో ముగ్గురు రైతులు గాయపడ్డారు. జిల్లా వ్యాప్తం గా మొత్తం 12 మంది తీవ్రగాయాల పాలయ్యా రు. గాయపడిన వారందరిని రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రజలు, రైతు లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా సూచించారు.

తాంసి : మండలంలో పిడుగుపాటుతో గురు వారం ఆలయ గోపురం ధ్వంసం అయింది. జిల్లాలో పిడుగులతో కూడిన వర్షం కురవగా బండల నాగపూర్‌లో గల రామాలయంపై అగ్గి పిడుగు ప్రభావంతో గోపురంపై ఉన్న కలశం ధ్వంసం కాగా గోపురానికి బీటలు బారాయని స్థానికులు తెలిపారు.



కురుస్తున్న వర్షం

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ..బిజీ



పంట పొలంలో విత్తనాలు నాటుతున్న రైతులు

తాంసి , జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గడచిన మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతాంగం విత్తనాలు నాటే కార్యక్రమంలో బిజీ అయ్యారు. గడిచిన ఖరీఫ్‌తో పాటు రబీ నష్టాలు కలిగించినప్పటికీ వాటిని పక్కనపెట్టి మళ్లీ రైతులు ఖరీఫ్ అడుగు పెట్టారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాలలో చాలామంది రైతులు వారి పంట పొలాల్లో విత్తనాలు నాటారు. వాతావరణం చల్లబడంతో రైతులు బిజీ అయ్యారు. ఏ పంట పొలంలో చూసిన విత్తనాలు నాటడంలో కూలీలు బిజీగా కనిపించారు. రైతులను ఖరీఫ్ ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడంలో విఫలం

● మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్‌అర్బన్, జూన్12 (ఆంధ్రజ్యోతి): పేదబడుగు బలహీన వర్గాల విద్యను సీఎం రేవంత్‌రెడ్డి అడ్డుకుంటున్నారని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న అన్నా రు. ప్రస్తుతం కొన్ని పాఠశాలలు, వసతి గృహాల భవనాలు నిధులు లేని కారణంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గురువారం ఇంటిగ్రేటెడ్ మా ర్కెట్‌తో పాటు వసతిగృహాల నిర్మాణాలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి జోగురామన్న మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన విద్యను అందించడానికి గత సీఎం కేసీఆర్ అనేక కార్య క్రమాలు చేపట్టారన్నారు. మైనార్టీ, బీసీ గురు కులాలకు సొంత భవనాలను నిర్మించారని తెలి పారు. ఇలా తెలంగాణను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు ప్రభుత్వ విద్యతో పాటు సౌకర్యాలు కల్పించడంలో విఫలమైం దన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన పనులకు నిధులు ఇవ్వకుండా అడ్డుకుంటుం దన్నారు. దాని కారణంగా పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బీసీ సముదాయాల భవనం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బీసీ హాస్టల్ తదితర పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇందు లో యూనిస్‌అక్బాని, మెట్టుప్రహ్లాద్, సాజిదొద్దిన్, దాసరి రమేష్, పవన్‌నాయక్, దమ్మ పాల్, బట్టుసతీష్, అన్నెల వసంత్, దయా నంద్, జావిద్, మహేశ్, ముఖీద్, అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న